TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406


నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 214 | సోమవారం 27-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

# నాసా చిత్రాలు..

## నగరాల వెలుగుల్లో మెరిసిన భారత్!

- నాసా టైమ్‌లాప్స్ వీడియో విడుదల
- రాత్రివేళ భారత్ వెలుగుల్లో మెరిసింది
- ISS నుంచి భారత్, శ్రీలంక దృశ్యాలు
- ఉరుములు, మెరుపులతో అద్భుత దృశ్యాలు
- వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది



రాత్రివేళలో భారత్ ఎంత అద్భుతంగా దర్శనమిస్తుందో తెలిపే ఓ టైమ్‌లాప్స్ వీడియోను నాసా కు చెందిన అంతరిక్ష కేంద్రం విడుదల చేసింది. ప్రకృతి సృష్టించే అందాలను రికార్డు చేసింది. భారత్‌తో పాటు శ్రీలంక తీర ప్రాంతాలను బంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది.

వీడియోలో అరేబియా సముద్రం నుంచి దక్షిణ భారత్, శ్రీలంక మీదుగా బంగాళాఖాతం వైపు ఐఎస్ఎస్ ప్రయాణిస్తోంది. ఆ సమయంలో మన్నార్ సింధు శాఖ, బంగాళాఖాతం తీరప్రాంతంపై ఉరుములు, మెరుపులతో కూడిన మేఘాలు వెలుగులతో దర్శనమిచ్చాయి. నగరాల వెలుగులు, ఆకాశంలో తుపాను మెరుపులు భారత్, శ్రీలంక తీరప్రాంతాల్లో మాయా ప్రపంచాన్ని సృష్టించాయి. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. భూమికి 400 కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఉంటుంది.

## అమెరికాను భయపెడుతున్న ఖైబర్ షెకాన్..!



2లో

## ఇకపై ఏ ఎన్నికల్లో పోటీచేయను: సిద్ధరామయ్య



2లో

## నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: ప్రహ్లాద్ జోషి



- కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి బాధ్యతలు స్వీకరణ.
- తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వ్యాఖ్య.
- ప్రధాని మోదీకి ప్రహ్లాద్ జోషి కృతజ్ఞతలు.
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత అదనపు బాధ్యతలు.
- వినియోగదారుల వ్యవహారాల శాఖతో పాటు విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వహించనున్నారు.

2లో

## త్వరలోనే ఆప్కో సహకార సంఘాల ఎన్నికలు


- చేనేత సంక్షేమమే ధ్యేయం
- త్వరలో ఆప్కో ఎన్నికలు
- రూ.25 వేల ఆర్థిక సాయం
- ప్రగడ కోటయ్యకు నివాళులు
- కుటుంబీకులకు ఘన సత్కారం




**చీరాల, జూలై 26 :** రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలతో పాటు ఆప్కో ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. చీరాలలోని పద్మశాలీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులైన నేతన్నలందరికీ 'నేతన్న సేవలో' పథకం కింద ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు.

పేజి 2లో ▶

# ఆసుపత్రిలో బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు



**ఏఐజీ ఆసుపత్రిలో బాలకృష్ణ చికిత్స**


- చిత్రీకరణలో గాయపడిన బాలకృష్ణ
- ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స
- ఆసుపత్రికి వెళ్లి పరామర్శించిన సీఎం చంద్రబాబు
- ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న సీఎం
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
- వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది

హైదరాబాద్: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో పరామర్శించారు. ఇటీవల సినిమా చిత్రీకరణ సందర్భంగా ప్రమాదవశాత్తు గాయపడిన బాలకృష్ణ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చంద్రబాబు నాయుడు నేరుగా ఆసుపత్రికి వెళ్లి బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. బాలకృష్ణ త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలు, సినీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైద్య బృందం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు మంచి స్పందన ఉందని ముఖ్యమంత్రికి వివరించింది. కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం ఆయన పూర్తిగా కోలుకుంటారని వైద్యులు తెలిపారు.

పేజి 2లో ▶



## బంగాళాఖాతంలో వాయుగుండం



2లో

## విషాదం.. శ్రీరాంసాగర్ జలాశయంలో ఈతకు దిగి ముగ్గురి మృతి



బాల్కొండ: నిజామాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ జలాశయం (ఎస్సారెస్పీ)లో ఈతకు దిగి ముగ్గురు యువకులు మృతిచెందారు. ముప్కాల్ వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఈతకు దిగిన ఐదుగురు యువకులు నీటమునిగి గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురు చనిపోగా, ఒకరు గల్లంతయ్యారు. మరొకరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. మృతులు నిజామాబాద్‌కు చెందినవారిగా సమాచారం. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి

# ఎంపీ, ఎమ్మెల్యే కావడానికి 25 ఏళ్లు ఎందుకు?


## చట్టసభల పోటీకి ఏజ్ తగ్గించాలి: సీఎం రేవంత్





2లో

## 13 వేలమంది బాలికల థింసా నృత్యంతో మోదీకి స్వాగతం



విజయనగరం రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1న భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవ సభ, ఏర్పాట్లపై మంత్రులు వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి విజయనగరంతో పాటు విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ చేయాలని నిర్ణయించారు. విజయనగరంలో నియోజకవర్గాల నుంచి ఎక్కువ మందిని సమీకరించాలని సూచించారు. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు ప్రైవేటు పార్కింగ్ స్థలాలను ఎంపిక చేయాలని మంత్రులు ఆదేశించారు. విమానాశ్రయంలో 13 వేల మంది బాలికలతో అరకు థింసా గిరిజన నృత్యంతో ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలకాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 6 వేలు, పార్వతీపురం మన్యం నుంచి 5 వేలు, పోలవరం జిల్లా నుంచి 2 వేల మంది బాలికలకు థింసా నృత్యంలో పాల్గొంటారని వివరించారు.

## నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తి అరెస్టు



2లో

TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
27-07-2026

# సంపాదకీయం

## భయం నీడలో మీడియా!

అప్పుడు తప్పు అన్నవాళ్లు ఇప్పుడు ఒప్పు అంటున్నారు. అప్పుడు ఒప్పు అన్నవాళ్లు ఇప్పుడు తప్పు అంటున్నారు. నాడు అన్నా హజారే ఆమరణ దీక్ష చేయగా నేడు సోనమ్ వాంగ్ చుక్ దీక్ష చేశారు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం ఉండగా ఇప్పుడు నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది. నాటి ప్రభుత్వం ఉద్యమకారుల డిమాండ్లకు తలొగ్గి ఉన్నత స్థానాల్లో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్ బిల్లును తీసుకురాగా, నేటి ప్రభుత్వం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ విషయంలో మాత్రం తెగేదాకా లాగి, చివరకు అంగీకరించింది. అప్పుడు అన్నా హజారేకు తోడుగా నిలిచిన అరవింద్ కేజ్రీవాల్ ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీని ఏర్పాటు చేసి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎదిగి ప్రస్తుతం మాజీ సీఎంగా మిగిలారు-- ఇప్పుడు బొద్దింకల జనతా పార్టీ అని ప్రకటించుకున్న అభిజీత్ దీప్కే రేపు ఏమవుతారో తెలియదు. నీట్ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రం లీక్ అవడంతో ప్రారంభమైన ప్రస్తుత ఉద్యమం ఇప్పుడు తీవ్రమై దేశ రాజకీయాలను కుదిపేసింది. రాజకీయంగా అత్యంత బలశాలి అని అందరూ భావిస్తున్న ప్రధాని మోదీ ఒక మెట్టు దిగొచ్చి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించక తప్పలేదు. విద్యార్థుల కోసం విద్యార్థులతో ప్రారంభమైన ఈ ఉద్యమం ప్రతిపక్షాల చేతికి ఆయుధం అందించింది. అన్నా హజారే దీక్ష వల్ల లోక్‌పాల్ చట్టం వచ్చినా దేశంలో ఉన్నత స్థానాల్లో అవినీతి ఏ మాత్రం తగ్గలేదు. ఇప్పుడు సోనమ్ వాంగ్ చుక్, అభిజీత్ దీప్కే వంటి వారి వల్ల ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినా ప్రశ్నపత్రాల లీకేజీలు ఆగిపోతాయని చెప్పలేము. అయితే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అభిజీత్ దీప్కే అనే దళిత యువకుడు ప్రకటించిన కాక్రోచ్ జనతా పార్టీ ఈ స్థాయిలో ప్రభావం చూపడం ఏమిటి? సోనమ్ వాంగ్‌చుక్ ప్రారంభించిన ఆమరణ దీక్షకు యువత భారీగా స్పందించడానికి కారణం ఏమిటి? ఢిల్లీ జంతర్ మంతర్‌లో అన్ని వేల మంది పోగవడానికి ఏమిటి కారణం? వంటి ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం దారుణం అనే అనుకుందాం. అయితే ఆ సంఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం మేల్కొని నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించింది. ఫలితాలు కూడా వెల్లడయ్యాయి. అంటే వివాదం అంతటితో ముగిసినట్టే కదా? అయినా నీట్ పరీక్ష పేరిట వివాదం ఇంకా సజీవంగా ఉండటం ఏమిటి? అంటే యువతలో ఈ స్థాయిలో అసంతృప్తి నెలకొనడానికి వేరే కారణం ఏదో ఉంది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్షాలను ముప్పుతిప్పలు పెడుతూ ప్రశ్నించే గొంతులను కట్టడి చేయగలిగిన ప్రధాని మోదీ, ఇప్పుడు మాత్రం ఒక మెట్టు దిగడానికి కారణం ఏమిటి? దీన్నిబట్టి మన దేశంలో రాజకీయ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని స్పష్టమవుతోంది. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా కుదురుకోకపోవడం ఏమిటి? నిన్నటి వరకు ప్రజలకు పెద్దగా పరిచయం లేని అభిజీత్ దీప్కే అనే యువకుడు కాక్రోచ్ జనతా పార్టీని ప్రకటించడం ఏమిటి? వేల మంది యువతీ యువకులు బొద్దింకలుగా మారి ఢిల్లీని చుట్టుముట్టడం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే ప్రజల్లో ఏ స్థాయిలో అసహనం గూడుకట్టుకుందో అర్థమవుతుంది.

**న్యాయ వ్యవస్థ వైఖరితో..**

ఈ మొత్తం ఉదంతం నేపథ్యంలో ఆత్మవిమర్శకు ఏ ఒక్క వ్యవస్థ కూడా మినహాయింపు కాదని స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన నాలుగు వ్యవస్థలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలపై ప్రజలు ఇదివరకే విశ్వాసం కోల్పోగా, ఇప్పుడు న్యాయ వ్యవస్థ, మీడియాపై కూడా విశ్వాసం కోల్పోతున్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు తమను దగా చేస్తున్నాయని భావిస్తున్న ప్రజలకు న్యాయ వ్యవస్థ--మీడియా వద్ద కూడా ఉపశమనం లభించడం లేదా? అని ప్రశ్నించుకుంటే అవుననే సమాధానం వస్తోంది. యువతను బొద్దింకలతో పోల్చుతూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో కాక్రోచ్ జనతా పార్టీ పుట్టుకురావడం, ఆ పార్టీకి యువత ఆకర్షితులు కావడం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే అన్ని వేళ్లూ న్యాయ వ్యవస్థ వైపే చూపుతున్నాయి. అధికారానికి న్యాయ వ్యవస్థ లొంగిపోయిందన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం తాజాగా చేసిన వ్యాఖ్యలు పుండు మీద కారం చల్లినట్టుగా ఉన్నాయి. యువతను బొద్దింకలతో పోల్చడంపై విమర్శలు చెలరేగినా సంయమనం పాటించకుండా, ఇప్పుడు జంతర్ మంతర్ వద్ద పోలీసుల లాఠీచార్జి దెబ్బలను వీక్షించాలన్న పిటిషనర్ వినతిపై స్పందిస్తూ, తమకు అంత సమయం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నేటి తరానికి ఓపిక తక్కువ అని రెచ్చగొట్టే విధంగా సుప్రీంకోర్టు తాజాగా మరో వ్యాఖ్య చేసింది. సమయం, సందర్భం చూసుకోకుండా సర్వోన్నత న్యాయస్థానం ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో సమస్య మరింత జటిలం అవుతోంది. ప్రజల్లో కోల్పోతున్న విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నించాల్సింది పోయి అసందర్భ వ్యాఖ్యలతో అగ్నికి ఆజ్యం పోయడం ఏమిటి? ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధిత ప్రజలకు ఉపశమనం కలిగించాల్సిన గురుతర బాధ్యత న్యాయ వ్యవస్థపై ఉంది. న్యాయ వ్యవస్థలో అవినీతి రాజ్యమేలుతోందన్న భావన ప్రజల్లో విస్తృతంగా వ్యాపించిన ప్రస్తుత తరుణంలో న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానాల్లో ఉండేవారు చేసే వ్యాఖ్యల ప్రభావం సమాజంపై బలంగా ఉంటుంది కదా? అయినా యథాలాపంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యం కాదా? జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్నవారు పోలీసులపై దాడి చేశారా? పోలీసులే ఆందోళనకారులను దారుణంగా కొట్టారా? అన్న విషయం పక్కన పెడితే, సదరు వీడియోలను చూసే సమయం తమకు లేదని న్యాయవ్యవస్థ వ్యాఖ్యానించడం యువతను రెచ్చగొట్టడం కాదా? దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను గమనంలోకి తీసుకోవలసిన బాధ్యత న్యాయ వ్యవస్థపై లేదా? యువతను బొద్దింకలతో పోల్చినందుకే కాక్రోచ్ జనతా పార్టీ పుట్టుకొచ్చిన విషయం విస్మరిస్తే ఎలా? ప్రస్తుత రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం అంతరించింది. ఈ కారణంగానే అభిజీత్ దీప్కే అనే అనామకుడు ప్రకటించిన కాక్రోచ్ జనతా పార్టీకి యువత మద్దతు ఇస్తోంది. తెరపైకి వచ్చిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశం మాత్రమే మనకు కనిపిస్తోంది గానీ దీని వెనుక ప్రజల్లో, ముఖ్యంగా యువతలో గూడుకట్టుకున్న నిరాశా నిస్పృహలను ప్రస్తుత పరిణామాలు ఎత్తిచూపుతున్నాయి. అన్నా హజారే ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఉద్యమం తెరమరుగైనట్టుగానే ఇప్పుడు కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమం కూడా మటుమాయం కావొచ్చు. అయితే ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలు అలాగే మిగిలి ఉంటాయి. ఫలితంగా ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు పుట్టుకురావొచ్చు. కొత్త సంస్థలు, పార్టీలు ఆవిర్భవించవచ్చు. ఎవరెవరో నాయకులుగా ఎదగవచ్చు. నాడు అన్నా హజారే చేపట్టిన ఉద్యమం వల్లనే అరవింద్ కేజ్రీవాల్ నాయకుడిగా ఎదిగారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించింది. అయితే అదే కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మద్యం కొనుగోళ్లలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై జైలుకు కూడా వెళ్లారు. కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారా? లేదా? అన్నది ఎప్పటికి తేలుతుందో తెలియదు. అయితే ఇలాంటి సంఘటనల వల్ల ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితులలో ప్రజలకు మిగిలిన ఏకైక ఆశా దీపం న్యాయ వ్యవస్థ మాత్రమే. ఇప్పుడు ఆ న్యాయ వ్యవస్థ కూడా అసందర్భ ప్రేలాపనలతో ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేసుకుంటోంది. దేశంలోని వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు ఇటీవల చేసిన వ్యాఖ్యలను బట్టి సర్వోన్నత న్యాయ స్థానంపై వారికి కూడా నమ్మకం పోతున్నట్టుగా ఉంది. ఈ పరిణామం ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదు.

**మీడియాకు ఏమైంది?**

ఇప్పుడు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా విషయానికి వద్దాం. మిగతా వ్యవస్థలపై విశ్వాసం కోల్పోయినట్టుగానే ప్రజలు ఇప్పుడు మీడియాపై కూడా నమ్మకం కోల్పోతున్నారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చోటుచేసుకున్న సన్నివేశాలే ఇందుకు నిదర్శనం.

## ఆసుపత్రిలో బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

**ఏఐజీ ఆసుపత్రిలో బాలకృష్ణ చికిత్స**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**చిత్రీకరణలో గాయం**

హైదరాబాద్, జూలై 26 :
సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఇటీవల ఒక సినిమా షూటింగ్‌లో ప్రమాదవశాత్తు గాయపడిన బాలకృష్ణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లిన చంద్రబాబు, ఆయనను నేరుగా కలిశారు.

**ఆరోగ్య పరిస్థితిపై విచారణ**

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలను వైద్యులతో చర్చించారు. బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

**షూటింగ్‌లో గాయం**

సినిమా చిత్రీకరణ సమయంలో బాలకృష్ణకు అనుకోకుండా గాయమైంది. దీంతో మెరుగైన వైద్యం కోసం ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది.

**త్వరలోనే డిశ్చార్జ్**

వైద్యుల ఆధ్వర్యంలో అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆయన వేగంగా కోలుకుంటున్నారని వైద్య వర్గాలు తెలిపారు. చికిత్స పూర్తికాగానే త్వరలోనే ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంది.

## త్వరలోనే ఆప్కో సహకార సంఘాల ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

**నేతన్నలకు విస్తృత సంక్షేమం**

కూటమి ప్రభుత్వం చేనేతల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి పేర్కొన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పింఛను ఇస్తున్నామని, మగ్గం నేసేవారికి 200 యూనిట్లు, మరమగ్గం వారికి 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తామన్నారు.

**ప్రగడ కోటయ్య స్ఫూర్తి**

చేనేత రంగానికి ప్రగడ కోటయ్య చేసిన సేవలు అనన్యమైనవని, ఆయన స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి అన్నారు. అమరావతిలో రూ.10 కోట్లతో ప్రగడ కోటయ్య స్మృతివనం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం నేతన్నలను మోసం చేసిందని, అర్హత లేని వారికి నిధులు మళ్లించిందని విమర్శించారు.

**కుటుంబ సభ్యులకు సత్కారం**

కార్యక్రమంలో భాగంగా ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఉన్నతాధికారులు ఆర్పీ సిసోడియా, రేఖారాణి, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీ, ఎమ్మెల్యే కావడానికి 25 ఏళ్లు ఎందుకు?
## చట్టసభల పోటీకి ఏజ్ తగ్గించాలి: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

దేశ రాజకీయాలో యువత పాత్ర మరింత క్రియాశీలకంగా మారాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థుల కనిష్ట వయోపరిమితిని ప్రస్తుతమున్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని ఆయన అన్నారు.

21 ఏళ్ల వయస్సులోనే యువత సివిల్ సర్వెంట్ అధికారులుగా దేశాన్ని పాలిస్తున్నప్పుడు.. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేయడానికి మాత్రం 25 ఏండ్లు ఎందుకు ఉండాలని ఆయన ప్రశ్నించారు. పరిపాలనలో యువతకు పెద్దపీట వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదనపై భవిష్యత్ కార్యాచరణను కూడా ఆయన ప్రకటించారు . రాబోయే ఆగస్టు నెలలో శాసనసభలో దీనిపై ప్రత్యేక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఈ ప్రతిపాదనను వివరిస్తానని, కూటమి పార్టీలన్నింటినీ త్వరలో కలుస్తానని వెల్లడించారు.

ఇదే వేదికగా దేశంలో నిరుద్యోగులను వేధిస్తున్న పేపర్ లీకేజీల అంశంపై కూడా సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్ తీవ్రంగా దెబ్బతింటోందని, వీటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రశ్నించిన ప్రతిపక్షాలపై ఈడీల ద్వారా వేధించారని, అయితే యువత ఐక్యంగా పోరాడితే కేంద్రం సైతం తలవంచక తప్పదని ఆయన హెచ్చరించారు.

## మల్లన్న దర్శనానికి ఇక సులభంగా..
## కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్ ప్రారంభం



కొమురవెల్లి: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్‌ను కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని చెప్పారు.

**తీరనున్న భక్తుల ఇబ్బందులు**

మల్లన్న భక్తులు కొమురవెల్లి చేరుకునేందుకు ప్రస్తుతం బస్సులు, ఇతర వాహనాల్లో వస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. బస్సుల్లో వచ్చే భక్తులు రాజీవ్ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న కొమురవెల్లికి చేరుకోవడానికి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు ప్రధాన రహదారిపై గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేది. రోడ్డు ప్రయాణం ద్వారా హైదరాబాద్ నుంచి సుమారు 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 90 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ రెండు మూడు వాహనాలు మారాల్సి వస్తోంది. చేర్యాల, మద్దూరు, ధూల్మిట్ట మండలాల ప్రజలకు సైతం రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది. చదువుల కోసం వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు నిత్యం సుమారు 100 నుంచి 200 మంది వెళ్తుంటారు. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారికి ఒక్కొక్కరికి సుమారు రూ.100 నుంచి రూ.200, కరీంనగర్ నుంచైతే రూ.100- 150 ఖర్చు తప్పదు. రైలు ప్రయాణమైతే సగం ఖర్చు భారం తగ్గుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నిలుపుదల చేసే రైళ్ల వివరాలు..**

సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వరకు నడుస్తున్న 4 డెమూ రైళ్లకు ప్రతి రోజూ ఈ స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించారు.

సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వచ్చే 77654 డెమూ రైలు బుధవారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 2:38 గంటలకు.. 77656 డెమూ రైలు గురువారం మినహా ప్రతి రోజూ ఉదయం 6:45 గంటలకు కొమురవెల్లికి చేరుకుంటుంది.

## అమెరికాను భయపెడుతున్న ఖైబర్ షెకాన్..!

మొదటి పేజీ తరువాయి

అమెరికా ను ఇన్నాళ్లు షాహెద్ డ్రోన్లు గుక్క తిప్పుకోనీయకుండా చేస్తే.. ఇప్పుడు దానికి తోడుగా ఓ చౌకబారు క్షిపణి వచ్చి చేరింది. దాని పేరు ఖైబర్ షెకాన్. దీని రేంజి 1,400 కిలోమీటర్లు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై జరిగిన భీకర దాడుల్లో ఈ క్షిపణిదే కీలక పాత్ర.

పాత ఇరాన్ క్షిపణులతో పోలిస్తే ఇది విభిన్నమైనది. ఘన ఇంధనంతో పనిచేస్తుంది. శత్రువుపై వినియోగించే ముందు.. దీనిలో ఇంధనం నింపాల్సిన అవసరం లేదు. ఫలితంగా వీటిని ట్రక్కులపై లోడ్ చేసి.. వేగంగా తరలించి శత్రువుపై దాడి చేయవచ్చు. దీంతో ఇరాన్ క్షిపణి లాంఛర్ల కోసం యుద్ధ విమానాలు వెతికే వేళ త్వరగా తప్పించుకొనే అవకాశం ఉంది.

యుద్ధం వేళ కొన్ని ఖైబర్ క్షిపణులను కూల్చినా.. ఇరాన్ ప్రత్యేకమైన ఫ్లైట్‌పాత్‌లు, కదలికలు, స్పీడ్‌తో వీటిని అమెరికాకు దొరక్కుండా చేస్తోంది. దీనికి తోడు కొన్ని వేరియంట్లకు ముక్కు భాగంలో ఇరాన్ చిన్న ఇంజిన్లను అమర్చుతోంది. ఇది క్షిపణి దాడి చేయాల్సిన లక్ష్యం దగ్గరయ్యే కొద్దీ దిశను మార్చుకోవడానికి ఉపయోగపడటంతో పాటు.. వేగాన్ని గంటకు 10,000 కిలోమీటర్లకు తీసుకెళుతోంది. ఈ క్షిపణులను అటాక్ డ్రోన్లు, మరికొన్ని మిసైల్స్‌తో కలిపి ఇరాన్ వాడుతోంది.

యుద్ధం ప్రారంభం నాటికి ఇరాన్ వద్ద సుమారు 2,500 ఖైబర్ షెకాన్ క్షిపణులు, ఇతర మిసైల్స్ ఉన్నాయని అమెరికా అంచనావేసింది. వీటితోపాటు అండర్ గ్రౌండ్ ఆయుధ కేంద్రాల్లో మరిన్ని అసెంబ్లింగ్ చేస్తున్నట్లు భావిస్తున్నారు. కాకపోతే.. క్షిపణి ఇంజిన్ల ఉత్పత్తి కేంద్రాన్ని మాత్రం అమెరికా ధ్వంసం చేసింది. ఇక అమెరికా, ఇజ్రాయెల్ వినియోగించే క్షిపణులతో పోలిస్తే దీని ధర కూడా చాలా చౌక అని ఆయుధ నిపుణులు వెల్లడిస్తున్నారు.

## నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: ప్రహ్లాద్ జోషి

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ: తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమితులైన ప్రహ్లాద్ జోషి అన్నారు. విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఎంతో వినయంతో ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ఎక్స్‌వేదికగా వెల్లడించారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించిన ఆందోళనలు తీవ్రమైన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి.. ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రిగా ఉన్న ఆయన.. ఇవాళ్టి నుంచి విద్యా శాఖ అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు.

## ఇకపై ఏ ఎన్నికల్లో పోటీచేయను: సిద్ధరామయ్య

మొదటి పేజీ తరువాయి

తాను 2028 అసెంబ్లీ ఎన్నికల తో పాటు ఇకపై ఏ ఇతర ఎన్నికల్లోనూ పోటీ చేయబోనని కర్ణాటక మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య ప్రకటించారు. రాజకీయ రంగం అవినీతిమయంగా మారిపోయిందని.. తనకూ వయసు పైబడటం, అనారోగ్య కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తనకు 79ఏళ్లని.. తన పదవీకాలం ఇంకా ఏడాదిన్నర పాటు ఉందని పేర్కొన్నారు. అప్పటికి తన వయసు 81-82 ఏళ్లకు చేరుకుంటుందన్నారు. ఆరోగ్యం బాగాలేకపోవడం వల్ల మునుపటిలా అదే ఉత్సాహంతో పనిచేయడం ఇక సాధ్యం కాదని వెల్లడించారు. అయితే ప్రజా జీవితంలో చురుకుగా ఉంటూ ప్రజల తరఫున గళం మాత్రం వినిపిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

2028 నాటికి తన రాజకీయ ప్రస్థానం 50ఏళ్లకు చేరుకుంటుందని సిద్ధరామయ్య తెలిపారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించానని.. దశాబ్దాల కాలంలో ఎన్నో విజయాలు, ఓటములు చవిచూశానని పేర్కొన్నారు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో తాను నమ్మిన సూత్రాలకు విరుద్ధంగా ఎప్పుడూ ప్రవర్తించలేదన్నారు. గతంలో తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు నియోజకవర్గ ప్రజలే స్వచ్ఛందంగా డబ్బు సమకూర్చేవారని సిద్ధరామయ్య తెలిపారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని.. ఎన్నికల్లో పోటీ చేయాలంటే ప్రజలకు డబ్బు పంచాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మద్దతుగా నిలిచిన కర్ణాటక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: ప్రహ్లాద్ జోషి

కొన్ని నెలల క్రితం సిద్ధరామయ్య స్వచ్ఛందంగా కర్ణాటక సీఎం పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. అనంతరం ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం

మొదటి పేజీ తరువాయి

అమరావతి: వాయవ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55-65 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశముందని వివరించింది. సముద్రం అలజడిగా ఉంటుందని.. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.


## నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తి అరెస్టు

మొదటి పేజీ తరువాయి

ప్రొద్దుటూరు నేరవార్తలు: కడప జిల్లా ప్రొద్దుటూరులో నకిలీ బంగారం విక్రయించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి బంగారం పూతతో ఉన్న రంగు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ విభాకృష్ణ మీడియాకు వెల్లడించారు. తిరుపతి జిల్లా పుత్తూరు మండలం వినాయకపురానికి చెందిన కన్నయ్య తక్కువ ధరకే బంగారం తయారు చేయిస్తానని నమ్మబలికాడు. దీంతో ప్రొద్దుటూరుకు చెందిన రవికుమార్ బంగారం కోసం కన్నయ్యకు విడతల వారీగా రూ.6.50 లక్షలు చెల్లించాడు. కొన్ని రోజుల తర్వాత కన్నయ్య.. రవికుమార్‌కు బంగారం పేరిట నాలుగు కడ్డీలు ఇచ్చాడు. అనుమానం వచ్చిన రవికుమార్ వాటి నాణ్యతను పరీక్షించగా అవి నకిలీవని తేలింది. మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కళ్యాణకట్టల్లో భక్తుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు: దేవస్థానం ఈవో హెచ్చరిక

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 26



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని కళ్యాణకట్టల్లో భక్తుల నుంచి నగదు వసూళ్లకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి స్పందించారు.గత రెండు మూడు రోజులుగా కళ్యాణకట్టల్లో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులు భక్తుల వద్ద నుంచి నగదు అడుగుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ప్రచారంలోకి రావడం వల్ల దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. భక్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయకుండా నేరుగా దేవస్థానం కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా కళ్యాణకట్టల్లో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులను ఈవో తన కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు డిమాండ్ చేయరాదని స్పష్టం చేశారు. ఇటువంటి ఘటనలు మరోసారి పునరావృతమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ ఈవోలు జయకుమారి, నాగుల మహేష్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, రాజేందర్, ఆలయ ఉద్యోగులు మరియు నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల నిరీక్షణకు ముగింపు... మరో కొత్త బస్ సర్వీస్ ప్రజలకు అంకితం

**వేములవాడ బస్ డిపో నుంచి ఎనగల్ బండపల్లి మరిమడ్ల మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు నూతన ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభం**

చందుర్తి మండలం/ ప్రజాదివాస్ జూలై 26



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలో వేములవాడ బస్ డిపో నుండి చందుర్తి మండలం ఎనగల్, బండపల్లి, మరిమడ్ల మీదిగా నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు నూతన బస్ సర్వీస్ ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు..ఈ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం ద్వారా రెండు జిల్లాల మధ్య కనెక్టివిటీ పెరిగి రవాణా సౌకర్యం మరింత బలోపేతం కానుంది..

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాన్ కి భారత్ బాత్ ప్రత్యేక ప్రసారం

ముస్తాబాద్/ జూలై 26 ప్రజా దివాస్





మన భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ 136 వ మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారం ముస్తాబాద్ మండల భారతీయ జనతా పార్టీ కార్యాలయం లో బిజెపి మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ ప్రత్యక్ష ప్రసారం వీక్షించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి, మెంగని మహేందర్, కోలా కృష్ణా, వరి వెంకటేష్, చికోటీ మహేష్, అజయ్ సునీల్ రాజు, వినయ్, అజయ్ హర్ష, కల్యాణ్, రితీష్ తదితరులు పాల్గొన్నారు

# వేములవాడ రాజన్న క్షేత్రానికి రూ.99.40 కోట్లు మంజూరు..

# మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు హర్షం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషి అభినందనీయం..**
**- నిధుల వరదతో వేములవాడకు మహర్దశ: పుల్కం రాజు**
**- పాలకవర్గంతో కలసి విప్ ఆది శ్రీనివాస్ ను సత్కరించిన మున్సిపల్ చైర్మన్**
**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు ధన్యవాదాలు తెలియజేసిన వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 26

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నిధుల మంజూరుతో ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరుకున్నాయి.రాజన్న ఆలయాభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడంపై వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో వైస్ చైర్మన్, పాలకవర్గ కౌన్సిలర్లతో కలిసి స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారించి వారు అభివృద్ధిపై చర్చించారు. అనంతరం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, మన వేములవాడ పుణ్యక్షేత్రానికి మహర్దశ పట్టిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర కృషి, పట్టుదలతోనే రాజన్న ఆలయానికి రూ.249.40 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయని కొనియాడారు. వేములవాడ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు, నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సహా ఇతర మంత్రులకు మున్సిపాలిటీ తరఫున, ప్రజల తరఫున మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.దేశంలోనే అత్యంత ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం దశలవారీగా నిధులు విడుదల చేస్తోందని చైర్మన్ పుల్కం రాజు పేర్కొన్నారు. గత 2023-24 బడ్జెట్‌లో రూ.50 కోట్లు, 2024-25 బడ్జెట్‌లో రూ.100 కోట్లు విడుదల చేయగా,



ఇప్పుడు మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడం ద్వారా ఆలయ విస్తరణ, మౌలిక వసతుల కల్పన పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే 45 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే భక్తులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చి వేములవాడ పట్టణం ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యాటకంగానూ ఎంతగానో అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రికి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. శృంగేరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారి సలహాలు, సూచనలతో పనులు ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.

# దిష్టి కుంభం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్





వేములవాడ/ప్రజాదివాస్ జూలై 26

వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన దిష్టి కుంభం కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ దిష్టి కుంభం కార్యక్రమం కేవలం ఆచారం మాత్రమే కాదని, సమాజమంతా సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలనే సంకల్పానికి ప్రతీక అని అన్నారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవించాలని కోరుకునే గొప్ప సంప్రదాయమే ఈ కార్యక్రమమని పేర్కొన్నారు...సుమారు 55 సంవత్సరాల క్రితం వెంకమ్మ అనే మహిళ ప్రారంభించిన దిష్టి కుంభం కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం నిరంతరాయంగా కొనసాగించడం అభినందనీయమని కొనియాడారు. సమాజ శ్రేయస్సు కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా నిర్వర్తించడం ప్రశంసనీయమని అన్నారు...వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వాటిలో సుమారు 45 శాతం పూర్తయ్యాయని చెప్పారు. రహదారి విస్తరణ, హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం వంటి పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు.ఆలయ అభివృద్ధికి అదనంగా అవసరమైన రూ.99.40 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నిధులతో ఆలయ ప్రాంగణాన్ని విస్తరించి, భవిష్యత్తు తరాలకు అనుగుణంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు, అధికారులకు విప్ కృతజ్ఞతలు తెలిపారు...ప్రాంత ప్రజలందరికీ ఎలాంటి అపశకునాలు, కీడు జరగకుండా, దిష్టి తొలగి సర్వత్రా శుభం కలగాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు...

# మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చేయూత..

**- రూ.50,116 విరాళం అందించిన ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబం**
**- కృతజ్ఞతలు తెలిపిన రజక సంఘం నాయకులు**

వేములవాడ /ప్రజాదివాస్ జూలై 26

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామ శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులు ఆదివారం రూ.50,116 విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ పనులకు చేయూతగా అందించిన ఈ విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు స్వీకరించారు. ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులకు శాత్రాజ్‌పల్లి రజక సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ



సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడే ఉద్దేశంతో ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన ఏనుగు మనోహర్ రెడ్డి కుటుంబం సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు వనపర్తి గంగయ్య, పొన్నాల మోహన్, మాజీ ఉపసర్పంచ్ చింతలతాడం మల్లయ్య,వనపర్తి మల్లేశం,కొన్నాల రఘుపతి,వనపర్తి జగన్, పొన్నాల మల్లేశం, రజక సంఘ సభ్యులు, యువజన సంఘ సభ్యులు, పి.ఎ.సి.ఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి,అడ్వకేట్ గుడిసె సదానందం,మ్యాకల శ్రీనివాస్, రేగుల రాజేశం,నల్ల సతీష్ రెడ్డి, విక్కుర్తి సాయిబాబు, మిట్టపల్లి అనిల్, గుడిసె అనిల్, గుడిసె పురుషోత్తం, బండ మహేందర్,గుడిసె దాసు,బండి అనిల్, నాగి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో పండుగ స్వప్న నాగరాజు

**- ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన**

**- ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**

ప్రజాదివాస్

ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం ముందుకు సాగుతున్న బీజేపీ నాయకులు, 11వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పండుగ స్వప్న--నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో, వాసుదేవ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఆదివారం కట్టరాంపూర్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కట్టరాంపూర్, గౌతమినగర్, అయోధ్యకాలనీ, బాబానగర్, కార్తికేయనగర్, రెడ్ హిల్స్ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉచిత వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యమని, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రజల మధ్య ఉంటూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు పండుగ స్వప్న--నాగరాజు దంపతులను అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వారు చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. శిబిరంలో ప్రముఖ జనరల్ లాప్రోస్కోపిక్, లేజర్ సర్జన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ రోగులను పరీక్షించి బ్లడ్ షుగర్, రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, హెర్నియా, హైడ్రోసీల్, వెరికోజ్ వెయిన్స్, డయాబెటిక్ ఫుట్, బ్రెస్ట్ లంప్స్‌తో పాటు ఇతర శస్త్రచికిత్సలకు సంబంధించిన సమస్యలపై ఉచిత వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం బీజేపీ నాయకులు పండుగ స్వప్న--నాగరాజు దంపతుల ప్రత్యేకత అని కొనియాడారు. వైద్య శిబిరాల వంటి ఆరోగ్య కార్యక్రమాలు మాత్రమే కాకుండా, నిత్యం కాలనీలు, బస్తీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి



పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి స్థానిక సమస్యలపై స్పందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న బీజేపీ నాయకులు పండుగ స్వప్న--నాగరాజు దంపతులు ప్రజాసేవను రాజకీయాలకు అతీతంగా కొనసాగిస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తూ ప్రజల సంక్షేమానికి తమ వంతు కృషి కొనసాగిస్తామని బీజేపీ నాయకులు పండుగ స్వప్న--నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పరి జయశ్రీ కోలకాని నరసయ్య, మహేందర్, శేఖర్, శ్రీనివాస్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీల ప్రముఖులు, యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే.. ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు



ప్రజాదివాస్

నగరంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డేతో పాటు కళాశాల 50వ వార్షిక స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ఆత్మీయ స్వాగతం పలికి, వారి విద్యా ప్రస్థానం విజయవంతం కావాలని ఆకాంక్షించింది. ఈ సందర్భంగా కళాశాల జోనల్ ఇంచార్జి తిరుపతి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. గత ఐదు దశాబ్దాలుగా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడం ఎస్ఆర్ జూనియర్ కాలేజీ ప్రత్యేకత అని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# హుజురాబాద్‌లో ఘనంగా ఛత్రపతి సాహూ మహారాజ్ 152వ జయంతి వేడుకలు

**- బీసీ రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి బీసీ జేఏసీ డిమాండ్**

ప్రజాదివాస్

హుజురాబాద్ పట్టణంలోని టిడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఛత్రపతి సాహూ మహారాజ్ 152వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీసీ జేఏసీ అధ్యక్షుడు సందేల వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవాధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, దేశంలో బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ల అమలుకు పునాది వేసింది



ఛత్రపతి సాహూ మహారాజేనని పేర్కొన్నారు. 1902లో ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల స్ఫూర్తితోనే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లకు స్థానం కల్పించారని అన్నారు. విద్య, కుల వివక్ష నిర్మూలన, మహిళా సాధికారత కోసం సాహూ మహారాజ్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు బీసీ రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు చిలుకమారి శ్రీనివాస్, ఇప్పకాయల సాగర్, మున్సిపల్ కౌన్సిలర్ ఇల్లందుల సమ్మయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ తడికమళ్ల శేఖర్, బీసీ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి దేవసాని ప్రియదర్శిని, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గజ్వేల్ మధుసూదన్, అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడు ఆడెపు సురేందర్, కొలిపాక క్రాంతి, మల్లేశం, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు సాహూ మహారాజ్ ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన సంఘ శ్రీరామ్

ప్రజాదివాస్



జూనియర్స్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు సంఘ శ్రీ రామ్ ఎంపికయ్యారు తేదీ 28 జులై 2026 నుండి 06 ఆగస్టు 2026 వరకు చెన్నైలోని మేయర్ రాధాకృష్ణ హాకీ స్టేడియం లో జరుగు జూనియర్స్ జాతీయస్థాయి హాకీ పోటీలకు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాం పల్లి గ్రామానికి చెందిన సంఘ శ్రీరామ్ ఎంపికైనట్లుగా జిల్లా హాకీ అసోసియేషన్ అధికారిక కార్యదర్శి మహమ్మద్ హమీద్ తెలిపారు. ఇటీవల గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టుగా తెలిపారు. హాకీలో మంచి ప్రతిభ కనబరచి అత్యున్నత స్థాయి పోటీలకు ఎంపిక కావాలనే ఉద్దేశంతో ఎండపెల్లి మండలం రాజారాం పల్లికి చెందిన సంగ శ్రీరామ్ కు కరీంనగర్ లోని స్టేడియంలో ప్రతిరోజు హాకీ కోచ్ మహమ్మద్ హమీద్ ద్వారా హాకీలో శిక్షణ తీసుకొని రెండుసార్లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టుగా కోచ్ తెలిపారు. ఇతని ఎంపిక పట్ల జిల్లా మరియు రాష్ట్ర హాకీ అసోసియేషన్ బాధ్యులు సర్దార్ రవీందర్ సింగ్, సర్దార్ సురేందర్ సింగ్, కళ్యాణి, మహమ్మద్ అన్వర్, కాలీద్ తదితరులు అభినందించారు.

# మాటలు కాదు.. చేతల్లో చూపించాలి

**- ప్రకటనలతో కాదు.. ఆచరణతోనే విశ్వాసం సంపాదించాలి**

**- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ స్పందన**

ప్రజాదివాస్

రాజకీయాల్లో హామీలు, ప్రకటనలు చేయడం కంటే వాటిని ఆచరణలో అమలు చేసి చూపించడమే నిజమైన నాయకత్వానికి కొలమానమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ అన్నారు. ప్రజలు మాటలను కాదు.. పనితీరును, పాలనలో కనిపించే ఫలితాలను విశ్వసిస్తారని పేర్కొన్నారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో తమ ప్రభుత్వం ఏర్పడితే జెన్-జీ ప్రతినిధికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగిస్తామని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల కంటే, కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న విద్యాశాఖ బాధ్యతలను యువతకు అప్పగించి ఆదర్శంగా నిలిస్తే ఆ ప్రకటనకు మరింత విశ్వసనీయత చేకూరేదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో హామీలు ఇవ్వడం సులభమేనని, వాటిని అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే అసలైన నాయకత్వమని అన్నారు. కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కొందరు ప్రతిపక్షాలు రాజకీయ విజయంగా ప్రచారం చేయడం సముచితం కాదని రంజిత్ కుమార్ అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్షల అంశంలో విద్యార్థుల ఆందోళనలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకుండా, విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, సంస్కరణలపై నిర్మాణాత్మక సూచనలు చేయడం ప్రతిపక్షాల బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో శాంతిభద్రతలు పరిరక్షించబడేలా, విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. విమర్శలు చేయడం మాత్రమే



కాకుండా ప్రజలకు ఉపయోగపడే ప్రత్యామ్నాయ విధానాలు, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు, విద్యా సంస్కరణలపై ఆచరణ సాధ్యమైన ప్రతిపాదనలు తీసుకురావడం ద్వారానే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. రాజకీయాల్లో ప్రజలు చివరికి మాటలను కాదు.. చేతలను మాత్రమే విశ్వసిస్తారని, అందువల్ల ప్రతి రాజకీయ పార్టీ హామీల కంటే ఆచరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని కనుకుంట్ల రంజిత్ కుమార్ పేర్కొన్నారు.

# అనాధ యాదమ్మ ను ఆదుకునేది ఎవరు...?



ముస్తాబాద్/ జూలై 26 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మీసా యాదమ్మ అనే ఒంటరి మహిళ ఆదుకునే వారు లేక బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు ఆ మహిళ ఒంటరి గతంలో హోటళ్లలో కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగించేది అకస్మాత్తుగా కాలు జారిపడి ఫ్రాచర్ కావడంతో పని చేయలేక నడవలేని స్థితిలో ఆ గుడిసెకే పరిమితమై ఆకలితో అలమటిస్తూ అన్నదాతల కొరకు ఎదురు చూస్తుంటుంది చుట్టుపక్కల ఉన్న కొందరు మానవత దృక్పథంతో ప్రతిరోజు ఆమెకు ఆహారాన్ని అందిస్తూ చూసుకుంటున్నారు తల్లితండ్రులు లేని అనాధ ఒంటరి మహిళ తినడానికి తిండి లేక ఎదురుచూపులు దాతలు ఎవరైనా ఉంటే ఇలాంటి మహిళకు తోచిన విధంగా ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని చుట్టుపక్కల మహిళలు కోరుతున్నారు

## పోచమ్మ తల్లి బోనాల మహోత్సవ కార్యక్రమం లో : మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి

ప్రజాదివాస్

జగిత్యాల పట్టణంలోని నవదుర్గ నగర్ కాలనీవాసుల ఆధ్వర్యంలో ఆదివారం ఆషాడ మాస సందర్భంగా నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఈ కార్యక్రమంలో స్థానిక నవదుర్గ కాలనీవాసులు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# మానసిక ఎదుగుదల లోపాలతో బాధపడుతున్న చిన్నారుల విషయంలో తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా బాధ్యత వ్యవహరించాలి

**- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ**

ప్రజాదివాస్
మానసిక ఎదుగుదల లోపాలతో బాధపడుతున్న చిన్నారుల విషయంలో తల్లిదండ్రులతో పాటు, సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో.. సాధన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఇంటెలెక్చువల్లీ ఛాలెంజ్డ్ (సాధన ఫౌండేషన్)కు చెందిన మానసిక దివ్యాంగులైన చిన్నారులతో కలిసి సంస్థ ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిల్లలతో మంత్రి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి అభిరుచులు, దైనందిన కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి నవ్వుతూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేశారు.



1996 నుంచి మెంటల్లీ చాలెంజ్‌డ్ పిల్లల కోసం ప్రత్యేక విద్య, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, వృత్తి శిక్షణ, పునరావాస సేవలు అందిస్తున్నామని సంస్థ నిర్వాహకులు మంత్రికి వివరించారు. సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. అవసరమైన సహకారాన్ని అందించి, అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి పిల్లలకు సేవ చేస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు.
పిల్లల జీవితంలో తొలి ఐదేళ్లు అత్యంత కీలకమైనవని అన్నారు. ఈ దశలోనే శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను గుర్తించి సకాలంలో చికిత్స, థెరపీ అందిస్తే వారి సమస్యను పరిష్కరించి, భవిష్యత్తును మెరుగుపరిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ లక్ష్యంతోనే తెలంగాణ ప్రభుత్వం 'బాలభరోసా' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ స్థాయి నుంచే చిన్నారుల్లో మానసిక, శారీరక ఎదుగుదల లోపాలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు, థెరపీ, పునరావాసం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. మానసిక ఎదుగుదల లోపాలతో ఇబ్బంది పడుతున్న పిల్లలకు అవసరమైన వైద్య సేవలు, విద్యను అందించేందుకు ప్రత్యేక వ్యవస్థలను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్.ఎస్.యు.ఐ నాయకుల సంబరాలు

ప్రజాదివాస్
ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ కొత్తగూడెం: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో, ఎన్.ఎస్.యు.ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాలు, ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలు, విద్యార్థుల హక్కుల కోసం జరిగిన పోరాటాలు ఫలితాన్నిచ్చాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పోరాడిన ప్రతి



విద్యార్థికి, యువజనానికి, ఉద్యమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని, విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, విద్యార్థుల హక్కుల కోసం ఎన్.ఎస్.యు.ఐ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ నాయకులు ఉర్సు శివ, తలారి మధు, షేక్ నయీమ్, షేక్ అఫ్రోచ్, అమ్ము, ప్రవీణ్, లక్కీ, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన :ఎమ్మెల్యేపాయం

ప్రజాదివాస్
గిరిజన విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం – – హాస్టళ్లలో నాణ్యమైన వసతులు కల్పించాలి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, వసతి గదులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం హాస్టల్‌లోని విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారికి అందుతున్న భోజనం నాణ్యత, మెనూ ప్రకారం ఆహారం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఎదురవుతున్న సమస్యలను విద్యార్థినులు వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా విద్యార్థినులతో కలిసి హాస్టల్‌లో భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతి సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్య బాధ్యత అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తు బాగుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పాయం



వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మైనారిటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మల్లన్న పేటలో యువకుడు మిస్సింగ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

ప్రజాదివాస్
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామానికి చెందిన బుర్ర శ్రీధర్(28) అనే యువకుడు ఈ శనివారం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు అని గొల్లపల్లి ఎస్సై కృష్ణా సాగర్ రెడ్డి తెలిపారు శ్రీధర్ తల్లి భాగ్యమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు బుర్ర శ్రీధర్ 5.5 అడుగుల ఎత్తు చామన చాయ కలిగి బ్లాక్ టీ షర్టు ధరించాడు అని ఆచూకీ తెలిస్తే గొల్లపల్లి పోలీస్ స్టేషన్ లో సమాచారం అందివ్వాలని ఎస్ఐ తెలిపారు



# కరీంనగర్‌లో ఎంఆర్‌ఎఫ్ 'బాలాజీ టైర్ వరల్డ్' ప్రారంభం




ప్రజాదివాస్
నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో భారతదేశ ప్రముఖ టైర్ల తయారీ సంస్థ ఎంఆర్ఎఫ్ ఆధ్వర్యంలో 'బాలాజీ టైర్ వరల్డ్' టైర్ల విక్రయ, సేవా కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కేంద్రంలో అత్యాధునిక దిగుమతి యంత్రాలతో చక్రాల సమతుల్యం, చక్రాల అమరిక, స్వయంచాలక టైర్ అమరిక సేవలను అందిస్తున్నారు. అలాగే ట్యూబులు, టైర్ల మరమ్మతులు, టైర్లలో నైట్రోజన్ వాయువు నింపే సౌకర్యాన్ని కూడా కల్పించారు. వాహనాలకు సేవలు అందుతున్న సమయంలో వినియోగదారులు విశ్రాంతి తీసుకునేందుకు శీతలీకరణ సదుపాయం కలిగిన ప్రత్యేక నిరీక్షణ మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఇదే కేంద్రంలో నాణ్యమైన ఎంఆర్ఎఫ్ టైర్లను కొనుగోలు చేసుకునే అవకాశం కూడా ఉంది. చెన్నైలోని ఎంఆర్ఎఫ్ అత్యాధునిక శిక్షణ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందిన నిపుణులైన సాంకేతిక నిపుణులు ఇక్కడ సేవలు అందించడం ఈ కేంద్రం ప్రత్యేకతగా నిర్వాహకులు తెలిపారు. దిగుమతి చేసుకున్న ఆధునిక చక్రాల అమరిక, సమతుల్య పరికరాల ద్వారా అత్యంత కచ్చితత్వంతో సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా మోటారిస్టులు ఎక్కువగా కోరుకునే జెడ్ఎల్ఎక్స్, పెర్ఫింజా కార్ల రేడియల్ టైర్లు సహా ఎంఆర్ఎఫ్‌కు చెందిన పలు నాణ్యమైన ఉత్పత్తులు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

# ఎమ్మెల్యే జారే నీ కలిసిన సీతారామ ప్రాజెక్ట్ నిర్వాసితులు

ప్రజాదివాస్
సీతారామా ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యను అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ని కలిసిన నిర్వాసితుల ఆదివాసి నాయకులు కారం శ్రీరాములు ఆధ్వర్యంలో



6 పంచాయతీల సర్పంచులు ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు సీతారామ ప్రాజెక్ట్ నిర్వాసితుల ఇబ్బందులు పంట కాలువలు ఇబ్బందులని వారికి తెలియపరిచినారు నిర్వాసితుల కోసం 30/07/26 పట్వారి గూడెం కళ్యాణ మండలంలో జిల్లా అధికారులకు అనగా కలెక్టర్ గారు ఐటీడీఏ పీవో నీటిపారుదల ఇరిగేషన్ అధికారులు స్థానిక మండల అధికారుతో సమావేశ ఏర్పాటు చేసి నిర్వాసితులకు న్యాయం చేస్తాను అని నిర్వాసితులకు అని హామీ ఇచ్చారు అని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు కూరం అర్జున రావు. మోకళ్ళ.గురుమూర్తి. వంక జానకి రాముడు. కొమరం సుశీల. మాజీ సర్పంచ్ కోరస సాగర్. చెలికానీ సూరిబాబు. తాటి రాములు. కుంజా చిన్న బాబు. కొండ్రు ప్రసాద్. తదితరులు ఉన్నారు

# "కార్గిల్ వీరులకు వందనం" వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాదివాస్
దేశరక్షణ కోసం, ప్రాణాన్ని పణంగా పెట్టిన కార్గిల్ యోధులకు మన హృదయపూర్వక వందనాలు!వెనక్కి తగ్గని వీరులు, విలనిపై విజయం కైవసం చేసుకున్న ధైర్య సింహాలే వారు – రక్తం చిందించి జెండా ఎగురవేసిన మహానుభావులు!ఆయుధాల కంటే ముందు నడిచింది వాళ్ల సాహసం,




మరణాన్ని ఎదురించి నిలిచింది వాళ్ల ఆత్మబలిదానం. అమరులైనా...వాళ్ల ఊసులు ఈ గాలి లో ఉన్నాయి, వాళ్ల స్ఫూర్తి మన శరీరాల్లో పరవశంగా నడుస్తోంది. వీర జవాన్ల జీవితం మనకు ఒక శాశ్వత పాఠం, దేశం ముందు...ఏదీ కాదు, ఎవ్వరిదీ కాదు! అందుకే, మనం చెప్పుకోవాలి గట్టిగా --- "భరతమాతకి జై!"మన ఒడిసి పట్టుకుందాం,భద్రత, సమగ్రత, ఐక్యత అనే త్రిసూత్రంతో! వాళ్ల బలిదానం వృథా కాకూడదు, మన సేవలతో వారి కలను సాకారం చేద్దాం. భరతమాత సేవలో మన ఊపిరి చివరి దాకా నిమగ్నం కావాలన్నది మన నిజమైన గౌరవం!కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఘన నివాళులు. సిలారపు దామోదర రాజనర్సింహ వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు.

# తిరుమలగిరి గ్రామ సర్పంచ్ బూర దేవేంద్రను పరామర్శించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



ప్రజాదివాస్
ఆదివారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామ సర్పంచ్ బూర దేవేంద్ర ఆరోగ్య సమస్యతో హైదరాబాద్ హాస్పటల్లో ట్రీట్మెంట్ చేసుకొని ఇంటికి వచ్చిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వచ్చి పరమశించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు ప్రజాప్రతినిధులకు గాని కార్యకర్తలకు గాని కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు గానీ ఏ ఆపద వచ్చినా నేను ఉన్నానని భరోసా ఇచ్చినారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జిల్లా కమిటీ సభ్యులు సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కోస్నపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు అదృశ్యం: పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కోస్నపల్లి ( రంగదాముని పల్లె ) గ్రామానికి చెందిన తుమ్మల్ల.లచ్చవ్వ 75 సంవత్సరాలు అనే వృద్ధురాలు అదృష్టమైనట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు ఆమె కుమారుడు తుమ్మల మల్లేశం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని కొమురయ్య సతీమణి అయిన లచ్చవ్వ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు వృద్ధురాలు ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలని ఎస్సై తెలియజేశారు

# కాటాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో రేషన్ కార్డు ఈ-కేవైసీ కార్యక్రమం





ప్రజాదివాస్

**కాటాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రేషన్ కార్డుదారులకు ఈ-కేవైసీ**

కార్యక్రమం నిర్వహించబడుతోంది. లిస్టులో పేరు ఉన్న ప్రతి రేషన్ కార్డుదారుడు తప్పనిసరిగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని గ్రామపంచాయతీ అధికారులు కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి కాటాపురం గ్రామ సర్పంచ్ శ్రీ దిడ్డి మోహన్ రావు గారు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి , ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ రేషన్ కార్డు ఈ-కేవైసీని త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కంది, తోగర్‌పల్లి, గ్రామాల్లో ఘనంగా తెలంగాణ రక్షణ సేన (తెరాస ) పార్టీ జెండా ఆవిష్కరణ

ప్రజాదివాస్
తెలంగాణ రక్షణ సేన (తెరాస ) సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కంది మండలం కంది గ్రామం, కొండాపూర్ మండలం తోగర్‌పల్లి మరియు గ్రామాల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కలబ్‌గూర్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితక్క పిలుపు మేరకు పంచజన్య సిద్ధాంతాలతో ప్రతి ఊరు, ప్రతి వాడలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఎగురవేస్తూ పార్టీ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లి, తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజా



హక్కులు, సామాజిక న్యాయం మరియు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి సంగారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెండా పండుగ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు మురళీకృష్ణ, శంకర్ నాయక్, అలాగే పార్టీ నాయకులు కంది ప్రదీప్, ధనుష్, వేణు, సురేష్, సందీప్, అరవింద్, అరుణ్, అనిల్, శివ, అఖిల్, భరత్, ఎం. రాహుల్ యాదవ్, బి. వేణు, డి. శివకుమార్, ఎం.డి. జుబేర్, ఎ. హర్ష, ఎం.డి. ఆసిఫ్, ఎం.డి. ముజ్జు, గొప్పల్ రెడ్డి, మనోజ్ రెడ్డి, రజనీకాంత్, కృష్ణమోహన్, సాయికాంత్ గౌడ్, శరణ్ నితిన్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేసి, తెలంగాణ రక్షణ సేనను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సంకల్పించారు.

# రేపు పిరమిడ్ లో గురు పౌర్ణమి వేడుకలు

**- 24 గంటలు ధ్యాన జ్ఞాన కార్యక్రమాలు..**

ప్రజాదివాస్
ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దుల గుట్టపై ఈనెల 28వ తేదీన గురు పూర్ణిమ సందర్భముగా నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరంలో గురుపూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు, న్యాయవాది సాయి కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 28 ఉదయం 7 గంటల నుండి బుధవారం ఉదయం 7 గంటల వరకు 24 గంటల పాటు అఖండ ధ్యాన జ్ఞాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధ్యాన జ్ఞాన కార్యక్రమానికి జ్ఞాన దాతలుగా కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు కేదానంద స్వామి, గీతా విజన్ వ్యవస్థాపకులు స్వామి స్థిత ప్రజ్ఞానందా సరస్వతి స్వామి, మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ కార్యదర్శి బ్రాహ్మణరత్న మారం శివప్రసాద్, బ్రహ్మర్షి ప్రేమ్ నాథ్, మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు దామోదర స్వామి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ రెడ్డి, ఇతర మాస్టర్లు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ గురు



పూర్ణిమ వేడుకలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. భక్తులందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం ధ్యానామృతం, సాయంత్రం అల్పాహారం అందజేస్తామన్నారు.

# మహా నేతకు శతకోటి వందనాలు మంత్రి దామోదర రాజనరసింహా

ప్రజాదివాస్
అందోల్ నేల చరిత్రలో ప్రజాసేవకు చిరునామాగా నిలిచిన మహనీయుడు కీ.శే. సిలారపు రాజనర్సింహ గారు. 1967, 1972, 1978 సంవత్సరాలలో వరుసగా ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాలు సాధించి, ప్రజల విశ్వాసమే తన రాజకీయ విజయమని నిరూపించిన ప్రజానాయకుడు. గృహ నిర్మాణ శాఖ మంత్రిగా వేలాది కుటుంబాల ఆశలకు చిరునామాగా నిలిచి, సేవనే తన పరమ ధర్మంగా ఆచరించిన మహోన్నతుడు. బడుగు, బలహీన, పీడిత, సబ్బండ వర్గాల సంక్షేమమే తన శ్వాసగా భావించి, ప్రతి అడుగులో సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించిన దార్శనికుడు. అధికారం




కోసం కాదు, ప్రజల అభ్యున్నతి కోసం చివరి శ్వాస వరకు పరితపించిన అపూర్వ నాయకత్వానికి ఆయన సజీవ సాక్ష్యం. సిలారపు వంశ గౌరవాన్ని ప్రజల ప్రేమతో శాశ్వతంగా నిలబెట్టి, సేవకు సరికొత్త నిర్వచనం ఇచ్చిన మహనీయుడు. ఆయన వేసిన అభివృద్ధి బాట అందోల్ ప్రజల హృదయాలలో నేటికీ చిరస్మరణీయంగా వెలుగుతోంది. అటువంటి మహోన్నత ప్రజానాయకుడు కీ.శే. సిలారపు రాజనర్సింహ గారి వర్ధంతి సందర్భంగా మా హృదయపూర్వక ఘన నివాళులు అర్పిస్తూ, వారి ఆశయసాధనకు మా అంకితభావాన్ని పునరుద్ఘాటిస్తున్నాము. సిలారపు దామోదర రాజనర్సింహ వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు.

# అర్హులందరికీ ఓటే లక్ష్యం?

**- పుల్కల్ మండలంలో 80 శాతం సర్ ప్రక్రియ పూర్తి...!**

**-తహసీల్దార్ కృష్ణ**

ప్రజాదివాస్
అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ (ప్రత్యేక ఓటరు నమోదు) కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని




పుల్కల్ మండల తహసీల్దార్ కృష్ణ తెలియజేశారు. మండలంలోని బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను సేకరిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సెలవు రోజైన బిఎల్డీలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వప్రక్రియను కొనసాగిస్తున్నారన్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు నమోదుకాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పుల్కల్ మండలంలో సుమారు 80 శాతం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను మరో వారం, పదిరోజుల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు బీఎల్వోలతో సహకరించి అవసరమైన వివరాలు అందించి,తమ పేర్లు ఓటరు జాబితాలో సరిగా నమో దయ్యేలా చూసుకోవాలని తహసీల్దార్ కృష్ణ విజ్ఞప్తి చేశారు.

# గబ్బిలాలపేటలో మౌలిక వసతులు కల్పిస్తాం:

**- భాజపా మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షురాలు రషీదా బేగం**

ప్రజాదివాస్
జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాలపేట కాలనీవాసులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి తన వంతు



కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షురాలు రషీదా బేగం హామీ ఇచ్చారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, సీసీ రోడ్లు లేక ప్రజలు పడుతున్న అవస్థలపై స్థానికులు ఆమెను కలిసి తమ సమస్యలను విన్నవించారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు రషీదా బేగం స్వయంగా గబ్బిలాలపేటను సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రోడ్లు, సరియైన డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, పూర్తి సమాచారంతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తానని తెలిపారు. ఎంపీ నిధులు ప్రభుత్వ సహకారంతో కాలనీలో త్వరితగతిన సీసీ రోడ్లు, డ్రైనేజీ లైన్లు, విద్యుత్ వసతులు మంజూరయ్యేలా చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. ఆమె సానుకూల స్పందనపై గబ్బిలాలపేట కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ధన్యవాదాలు తెలియజేశారు.

# ఛత్రపతి సాహు మహారాజ్ స్ఫూర్తితో బి.సి హక్కులు సాధించాలి

**- భారత్ ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు దాస్ రామ్ నాయక్**

**- హైదరాబాద్ లో ఘనంగా రిజర్వేషన్ దినోత్సవం**

ప్రజాదివాస్

బ్రిటిష్ పరాయి పాలనలో అణగారిన వర్గాల అభ్యున్నతికి రిజర్వేషన్లు కల్పించి సకల అసమానతలను రూపుమాపడానికి కృషి చేసిన ఛత్రపతి సాహు మహారాజ్ స్ఫూర్తితో బి.సి ప్రజల హక్కులు సాధించాలని భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షులు దాస్ రామ్ నాయక్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బిఎంపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ అధ్యకతన ఆదివారం జరిగిన రిజర్వేషన్ దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 80 సంవత్సరాలుగా ఈ దేశ పాలకులు దళిత బహుజన ప్రజలను అన్ని రకాలుగా అణచివేస్తున్నారని, ఓట్లు మనవి అయినా సీట్లు మనవి కాకుండా పోతుందని, దేశ ప్రజలకు వాస్తవ చరిత్రను, అణచివేత క్రమాన్ని తెలిపి చైతన్యం చేస్తున్న బామ్ సెఫ్ జాతీయ అధ్యక్షులు వామన్ మిశ్రాఫ్ నాయకత్వంలో అందరం కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. బామ్ సెఫ్ ఉద్యమాన్ని నీరు గార్చడం కోసం కాంగ్రెస్, బిజెపి పార్టీలు చాలా కుట్రలు చేస్తున్నారని అన్నారు. దేశంలో తీవ్ర అణచివేత వల్ల అణగారిన వర్గాల్లో తిరుగుబాటు వస్తుందని ఆ తిరుగుబాటును పక్క దారి పట్టించే కుట్రలు పాలకవర్గ పార్టీలు చేస్తున్నాయని అన్నారు. దేశ ప్రజల్లో అసమానతలకు కారణమైన బ్రాహ్మణిజాన్ని బహుజన వాదంతో ఎదురించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి పునాదులు వేసిన సాహు మహారాజ్ స్ఫూర్తితో బహుజన రాజ్య స్థాపనకు ఎస్సీ, ఎస్టీ, ఒబిసి లు ఐక్యతతో పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ జె శాంసన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించిన సాహు మహారాజ్ స్ఫూర్తితో స్థానిక సంస్థలతో పాటు, చట్టసభల్లో బి.సి ల వాటా సాధించాలని అన్నారు. 1990 లో మండల్ కమీషన్ ను వ్యతిరేకించిన బిజెపి నేటికి బి.సి జనగననకు, బి.సి రిజర్వేషన్లకు అడ్డుపడుతుందని, బి.సి లకు బిజెపి ప్రధాన శత్రువు అనే విషయాన్ని తెలియజెప్పాలని అన్నారు. సాంప్రదాయం, దేశ భక్తి, సనాతన ధర్మం పేరుతో బి.సి లను ఓటు బ్యాంక్ గా వాడుకొని అధికారంలోకి వస్తూ మళ్ళీ ఆ బి.సి ప్రజలను దోపిడీ చేస్తున్నారని అన్నారు. బి.సి రిజర్వేషన్లకు అడ్డ పడే న్యాయ వ్యవస్థలో బి.సి లకు రిజర్వేషన్లు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. బిఎంపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరచిన సామాజిక న్యాయానికి సాహు మహారాజ్ పాలనని, కొల్లాపూర్ సంస్థానంలో సాహు పాలన నుండి ఎన్నో విధానాలను తీసుకొని అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచారని అన్నారు. ఆధునిక భారతదేశ తొలి రిజర్వేషన్ సృష్టికర్త సాహు మహారాజ్ తన సంస్థానంలో అన్ని సామాజిక వర్గాల ప్రజల జనాభా దామాషా



ప్రకారం సకల సామాజిక రంగాల్లో సమాన హక్కులు కల్పిస్తూ అందరికీ రిజర్వేషన్లు అందించిన సాహు మహారాజ్ తన పట్టాభిషేకం నాడు జరిగినటువంటి అవమానాన్ని గమనించి ప్రజలంతా స్వాభిమానంతో జీవించే పాలన కోసం ఎన్నో సంస్కరణలు చేశారని, పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ అమలులో భాగంగా అంటరానితనాన్ని రూపుమాపేందుకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి సి జాక్ రాష్ట్ర చైర్మన్ కోల జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ వితంతువుల వివాహాలు, మహిళలకు విద్య , పేదలకు గురుకుల పాఠశాలల ఏర్పాటు లాంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి నేటి బహుజన సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంపి జాతీయ ఉపాధ్యక్షులు ముక్తి మహమ్మద్, బిఎంపి నాయకులు వి ధర్మయ్య, శాంతి, వేణుగోపాల్, పటేల్, బూక్యా రాజు, కుమార్, రవితేజ వివిధ సంఘాల నాయకులు దాసరి అజయ్ కుమార్ యాదవ్, సాయిని నరేందర్, ఎన్ జె శాంసన్, కోల జనార్ధన్ గౌడ్, పి శంకర్ తదితరులు పాల్గొన్నారు

# పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామంలో కట్ట మైసమ్మ దేవస్థాన గోపురానికి నవదాన్యాల సమర్పణ



ప్రజాదివాస్

అందోల్ నియోజకవర్గం పుల్కల్ మండలం గొంగ్లూర్ గ్రామంలోని కట్ట మైసమ్మ దేవస్థాన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్న సందర్భంగా తొలి ఏకాదశి పర్వదినాన అమ్మవారి గోపురానికి నవదాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పల్లె కిష్టయ్య, పుట్టి కిష్టయ్య, ఆలూరి బ్రహ్మానంద రెడ్డి, సర్పంచ్ యాదయ్య, ఉప సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, రాంసాని శ్రీనివాస్ రెడ్డి, గౌండ్ల కృష్ణ గౌడ్, గౌండ్ల రమేష్ గౌడ్, పట్లోళ్ళ కమాల్ రెడ్డి, పల్లె చంద్ర కిరణ్, గౌండ్ల ముకుంద, సున్నపు యాదయ్య, సున్నపు గొంగయ్య, కుమ్మరి గోవర్ధన్, వీర్ శెట్టి, కంటిని రాజు, పొట్టిపల్లి లక్ష్మణ్, శాగలేటి భాస్కర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ద

# సి పి ఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీలోచేరికలలు.

ప్రజాదివాస్

దమ్మపేట పంచాయితి పరిదిలోని మల్లారం కాలనీకిచెంనదిన పలుకుటుంభాలు సిపిఐ నుండి సిపిఐ ( ఎం ఎల్ )మాస్ లైన్ పార్టీలో చేరటంజరిగింది ఈసందర్భంగా జరిగిన సమావేశంలో సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్లి మాట్లాడుతూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సిద్ధాంత నిబద్ధత కలిగిన పార్టీ అని ఇందులో చేరినటువంటి వారిని అభినందిస్తూ



సాదరంగా పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. భారతదేశంలో నేడు నెలకొని ఉన్న మత ఉన్మాదం, పాసిజాన్ని ఎదుర్కోవాలంటే బలమైన విప్లవ పార్టీ అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు పందూరి వీరబాబు పిఓడబ్ల్యు నాయకురాలు గంగాధర నాగమణి తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారినవారు దొంగ లక్ష్మీనారాయణ, జాజిమొగ్గల భాను, నిమ్మల సాయిరామ్,మిద్దె నాగరాజు, ఇస్సాపూర్ శ్రీను, దొంగల వినాయక్ మోదుంపరుపు విశ్వంత్, మిద్దిని శివరామ్ ఇస్సాపూరి గౌరమ్మ తదితరులు ఉన్నార. ఇట్లు అమర్లపూడి రాము

# ఉద్యోగుల విభజన 26 జిల్లాలకే పరిమితం చేయాలి

**- 2023 ప్రమోషన్ ఉపాధ్యాయుల ఫోరం డిమాండ్**

ప్రజాదివాస్

రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఉద్యోగుల విభజనను 26 జిల్లాల ప్రాతిపదికన మాత్రమే చేపట్టాలని, 2023 ప్రమోషన్ ఉపాధ్యాయుల ఫోరం దర్శి నియోజకవర్గ కన్వీనర్ నేరేళ్ల జాన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, 2025 డిసెంబర్‌లో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం విడుదలైన గెజిట్ నోటిఫికేషన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో 26 జిల్లాలకే గుర్తింపు ఇవ్వబడిందని, అందువల్ల ఉద్యోగుల విభజన కూడా అదే ప్రాతిపదికన జరగాలని పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్‌లో మార్కాపురం జిల్లా, పోలవరం జిల్లాలు లేవని, అయినప్పటికీ 28 జిల్లాల ఆధారంగా విభజన చేపడితే అది రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమవుతుందని అన్నారు. ప్రకాశం జిల్లాలో సీనియారిటీలో వెనుకబడిన ఉపాధ్యాయులకు 28 జిల్లాల ప్రాతిపదికన విభజన చేస్తే తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి 26 జిల్లాల విధానాన్నే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, ప్రమోషన్ పొందిన తేదీ నుంచి కాకుండా, ఉద్యోగంలో నియామకం జరిగిన తేదీ నుంచే సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని బదిలీలు, ఇతర ప్రక్రియలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం బదిలీలకు అనుసరిస్తున్న విధానాన్ని ఉద్యోగుల విభజనలో కూడా అమలు చేయాలని సూచించారు. అలాగే జిల్లాల విభజన సమయంలో సీనియారిటీతో పాటు అభ్యర్థి స్థానికత (ఏడు సంవత్సరాల నిరంతర విద్య లేదా నివాసం ను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని నేరేళ్ల జాన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ అంశాలపై పునరాలోచించి న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే ఉపాధ్యాయులు తమ హక్కుల పరిరక్షణ కోసం కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

# ఫారెస్ట్ అధికారుల జాడ ఎక్కడ....?

**-చెట్లు నరికిన తెలియనట్టుగా వ్యవహరిస్తున్న ఫారెస్ట్ ఉన్నతాధికారులు**

**-విషయం తెలిసిన చర్యలు శూన్యం**

**-అధికారుల అండదండలతో భారీ చెట్లు మాయం**

ప్రజాదివాస్

పని అయితే ఏముంది అధికారులకు కావలసిందల్లా ముడుపులే. చేతులు తడిపితే చాలు చేయాలనుకున్న పనులు ఏమి కూడా ఆగవు. పుల్కల్ మండలంలో జరుగుతున్న తతంగం ఇది. ఫారెస్ట్ అధికారులు పైసలు ఇస్తే చాలు ఏ పని చేయడానికి అయినా వెనుకంజ వేయడం వాళ్లకు మించిన వారే లేరు. ఎక్కడైనా చెట్లు నరికితే ఆ విషయాన్ని గ్రామ ప్రజలు స్వయంగా ఫోన్ చేసి ఫోటోలతో సహా వాట్సప్ చేస్తే దానిని అదునుగా చేసుకొని చెట్ల వ్యాపారులతో మాటామంతి కలిపి జేబులు నింపుకొని పరిమిషన్ ఇస్తున్నారు. ఈ విషయంలో మీడియాకు తెలియకుండా జాగ్రత్త పడాలంటూ అధికారులే చెట్లు నరికి వేస్తున్న వ్యాపారులకు సలాహాలు ఇస్తున్నారు. దీనికి నిదర్శనం ఆదివారం మండల పరిధిలోని పెద్దరెడ్డిపేట గ్రామలో చెట్ల వ్యాపారులు చెట్లను నరికారు. ఈ విషయం గమనించిన గ్రామ ప్రజలు కొందరు ఫోటోలు తీసి ఫారెస్ట్ అధికారులకు వాట్సప్ చేసినట్లు సమాచారం. అయినప్పటికీ అధికారులు మాత్రం ఆ విషయంలో జేబులు నింపుకొని మరీ దగ్గరుండి చెట్లను నరికించారు అన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. గ్రామాలలో రైతులు వేసుకున్న పంటలకు అడవి పందులు వచ్చి పంటలు పాడు చేస్తుంటే వాటిని పట్టుకుంటే ఫారెస్ట్ అధికారులు పందులను పట్టుకున్న వారిని బెదిరించి కేసులు చేస్తున్నారు. కానీ అడవిలో పెరుగుతున్న చెట్లను వ్యాపారస్తులు నరికి వేస్తుంటే ఆ వ్యాపారులకు మాత్రం అండగా ఉండి స్వయానా ఫారెస్ట్ అధికారులే సైడ్ బిజినెస్ చేస్తున్నాను. ఈ విషయంలో పత్రికా మిత్రులు ప్రశ్నిస్తే మాకు అలాంటి విషయాలు ఏమీ తెలియవు అని మాటలు దాటవేస్తున్నారు. ప్రత్యక్షంగా చూసిన వ్యక్తులే ఫోటోలు సైతం అధికారులకు వాట్సప్ చేస్తే వారి నంబర్లను వ్యాపారులకి ఇచ్చి బెదిరింపులకు గురి చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు ఫారెస్ట్ అధికారులపై ఆగ్రహంతో ఉన్నారు.





**-మూడు పువ్వులు ఆరు కాయలు**

ఫారెస్ట్ అధికారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. చెట్లు నరికే వ్యాపారులతో కుమ్మక్కై పర్సెంటేజీల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రజల్లో వినికిడి. అందుకోసమే ఫారెస్ట్ అధికారులు ఈ విషయంలో పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు చేస్తున్నది ప్రభుత్వ ఉద్యోగమైన అంతర్గతంగా కట్టెల వ్యాపారం చేస్తున్నారని ఆరోపణలు ప్రజల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. పై స్థాయి అధికారుల నుంచి ఈ భాగోతం కిందిస్థాయి చిరు ఉద్యోగస్తుల వరకు ఇదే తతంగం జరుగుతుంది. ఇది ఇలానే కొనసాగితే గ్రామాలలో చెట్లను ఎక్కువ మొత్తంలో కూల్పోయే పరిస్థితి వస్తుంది.

**-ప్రభుత్వం పెంచమంటే ఫారెస్టు అధికారులు కొట్టిపిస్తున్నారు.**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెట్లను పెంచాలంటూ భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. కానీ గ్రామాలలో మాత్రం పెంచిన చెట్లనే ఫారెస్ట్ అధికారులు పర్మిషన్లు లేని వ్యాపారాలు చేస్తూ ఊర్లలో ఉన్న చెట్లను నరికిపిస్తున్నారు. ఇలాంటి అధికారులపై గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వెల్వడం గ్రామంలో అనారోగ్యంతో చనిపోయిన ప్రత్తిపాటి నాగేష్ కుటుంబానికి 5000/- మరియు బియ్యం టిక్కి ఆర్థిక సాయం చేసిన

**- మాజీ వై ఎస్ ఆర్ సి పి సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మరాజు**

ప్రజాదివాస్

యరమల రాంభూపాల్ రెడ్డి ఆ దేనుసారం నివాళులు అర్పించిన వెల్వడం వైఎస్ఆర్సీపీ నాయకులు మాజీ సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మ రాజు మైలవరం మండలం వెల్వడం గ్రామనికి చెందిన ప్రత్తిపాటి నాగేష్ ,అనారోగ్యం కారణంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రత్తిపాటి ధర్మ రాజు ప్రత్తిపాటి నగేష్ కి, నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి 5000/రూపాయలు మరియు బియ్యం టిక్కి కుటుంబానికి అందచేశారు

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నబాబు సందిపాము నాగేశ్వరరావు ప్రత్తిపాటి స్వాములు తొమ్మండ్రు అబ్రహం ప్రత్తిపాటి నాగార్జున మొండితోక భాస్కర్ పొదిలి కోటేశ్వరరావు నిమ్మకూరు రాజేంద్ర పచ్చిగోళ్ళ జాషువా ప్రత్తిపాటి తిరుపతి రావు దొండపాటి యిర్మీయా ప్రత్తిపాటి రామకృష్ణ దొండపాటి మహేష్ పొదిలి చంటి మొండితోక జమలయ్య ప్రత్తిపాటి వెంకట నాగేశ్వరరావు ప్రత్తిపాటి కొత్త రామయ్య పాల్గొని ప్రత్తిపాటి నాగేష్ కి,నివాళులర్పించారు